'నకిలీ'లపై నజర్

వర్షకాలం సీజన్ ప్రారంభమవడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. నకిలీ విత్తనాలతో నష్టపోకుండా చూడాలని వ్యవసాయ, పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలిన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- విత్తన, ఎరువుల దుకాణాలపై కొరడా
- వ్యవసాయ, పోలీస్ అధికారుల తనిఖీలు
- నాసిరకం, కాలం చెల్లినవాటిని అమ్మితే చర్యలు
- అప్రమత్తంగా ఉండాలని సూచన


చిలప్‌చెడ్‌లోని ఓ ఎరువుల దుకాణంలో సోదాలు నిర్వహిస్తున్న ఏఓ, ఎస్‌ఐ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో పీఏసీఎస్, నాబార్డ్ పరిధిలో ఒక్కొక్కటి, అలాగే ఆగ్రో రైతుసేవా కేంద్రంతోపాటు మరో మూడు ప్రైవేట్ ఎరువుల దుకాణాలు ఉన్నాయి. అన్ని దుకాణాలలో అధికారులు నిరంతరం సోదాలు నిర్వహిస్తున్నారు. రికార్డులు పరిశీలించి, నకిలీ విత్తనాలమ్మితే దుకాణం సీజ్‌చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మినా నేరమని, అలాంటి దుకాణ యజమానుల వివరాలు తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎరువులు, విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. కొనుగోలు చేసిన విత్తనాలు ఇతర దుకాణాలలో ఏ ధరలకు దొరుకుతున్నాయో ఆరా తీయాలి. అవసరమైతే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన రశీదులు తప్పనిసరిగా జాగ్రత్త చేసుకోవాలని అధికారులు చెప్తున్నారు.

పత్తి విత్తనాలు నాటాను..



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సాగు పనులు ప్రారంభించాను. ప్రతియేటా ఖరీఫ్ సీజన్లో ఎక్కువ మొత్తంలో పత్తి, కొద్ది మొత్తంలో వరి సాగుచేస్తాను. దుక్కులు పూర్తి కావడంతో పత్తి విత్తనాలు నాటాను. త్వరలోనే వరి తుకం కూడా వేస్తాను. కొన్న విత్తనాలు, ఎరువుల గురించి ఇతర దుకాణాలు, తోటి రైతులతో ఆరా తీశాను. ధరల విషయంలో ఎలాంటి తేడా లేదు.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు, చండూర్

నిరంతర తనిఖీలు



మండలంలోని ఎరువులు దుకాణాలలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాం. రైతులు మోసపోకూడదనే ఉద్దేశ్యంతో కఠినంగా వ్యవహరిస్తున్నాం. దుకాణదారులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు, ఎరువులను మాత్రమే అమ్మాలి. రైతులను మోసం చేసే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్‌గౌడ్, ఏఓ

మోసాలకు పాల్పడొద్దు



కష్టపడి పండించే రైతన్నను మోసం చేయొద్దు. నకిలీ విత్తనాలు, ఎరువులను అమ్మడం, అధిక ధరలకు విక్రయించడం నేరం. అలాచేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. రైతులు సైతం విత్తనాల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అవసరమైతే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి.

– నర్సింహులు, చిలప్‌చెడ్ ఎస్‌ఐ

రెండు రోజుల్లో అంగీకార పత్రాలు ఇవ్వాలి

అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ కలెక్టరేట్: రైస్ మిల్లర్లు రెండు రోజుల్లో గ్యారెంటీ, అంగీకార పత్రాలను అందజేయాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో రెవెన్యూ, పౌర సరఫరాలు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో రబీ కొనుగోలు ప్రక్రియ సంబంధించి బ్యాంక్ గ్యారంటీలు, సీఎంఆర్ డెలివరీపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 36 రైస్ మిల్లులను గుర్తించామని తెలిపారు. ఆ మిల్లులకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ రెండు రోజుల్లోగా అందించాలన్నారు. గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. మిల్లులవారీగా కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు అప్పగించిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. డెలివరీ ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డీఎం సివిల్ సప్లై జగదీష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్

కౌడిపల్లి(నర్సాపూర్): రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పీర్లతండాలో మంచినీటి సరఫరా, ఇంటింటికి నల్లా కనెక్షన్‌లపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల్లో ప్రతి ఇంటికి నల్లాకనెక్షన్ ఉంది.. లేనిది సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చినట్లు చెప్పారు. కొత్తగా నిర్మించిన ఇళ్లతో పాటు నల్లా కనెక్షన్‌లు లేని ఇళ్లను గుర్తించి అవసరమైన కనెక్షన్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే నల్లాలేని ఇంటికి నల్లాకనెక్షన్ ఇస్తామని తెలిపారు.


నల్లాకనెక్షన్ల సర్వే చేస్తున్న అరవింద్

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: వ్యవసాయ రంగంలో ప్రభుత్వం ఇస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యాన సాగుపై రైతులకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లాలోని ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి సైదులు, మండల ఇన్‌చార్జి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ నగేశ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధన, ఆహారం, మౌలిక వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విని బాగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని రెడ్డిపల్లి కాలనీ కస్తూర్బా బాలికల పాఠశాలలో అటెండర్, స్కావెంజర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఓ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్ పోస్టుకోసం 10వతరగతి, స్కావెంజర్ పోస్టుకు 7వతరగతి పూర్తి చేసిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 5లోగా పాఠశాలలో అందించాలని శ్రీవాణి తెలిపారు.

జెండా పండుగను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సైదుల్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మంగళవారం శివ్వంపేటలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కోసం దిమ్మె నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం వల్ల వర్గీకరణ సాధించుకున్నట్లు చెప్పారు. గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ జెండా పండుగలో అన్ని వర్గాల వారిని ఆహ్వానించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, లింగం, నర్సింలు, భిక్షపతి, సురేష్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా డాక్టర్స్ డే**



రామాయంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్లు, ఇతర సిబ్బందికి పలువురు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

◆ **పంటలకు ప్రాణం పోసిన వర్షం**

టేక్మాల్(మెదక్): ఇరవైరోజులుగా ముఖం చాటేసిన వర్షం సోమవారం రాత్రి కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. మండలంలో సాగు చేస్తున్న పత్తి, కంది, వరి పంటలు సాగు చేస్తున్న రైతులు భారీవర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. విత్తనాలు విత్తుకోవడం, మందులు చల్లడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.



◆ **దరఖాస్తుల ఆహ్వానం**

టేక్మాల్(మెదక్): టేక్మాల్ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో పీజీటీ ఇంగ్లిష్ బోధనకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఖాళీగా ఉన్నా రెండు ఇంగ్లిష్ పోస్టుల భర్తీకి పీజీ, బీ.ఎడ్ చదివిన వారు. ఈ నెల 4న ఉ.11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

◆ **బగలాముఖీ సన్నిధిలో న్యాయమూర్తి**



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంను మంగళవారం రంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసచారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి బగలాముఖీ అమ్మవారి విశిష్టత, శక్తిపీఠం నిర్మాణం గురించి వివరించారు.

క్లుప్తంగా

సమ్మెలో కార్మికులు భాగస్వాములు కావాలి


వైద్యురాలికి సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా వర్కర్లు

శివ్వంపేట(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు భాగస్వాములు కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆశా సిబ్బందితో కలిసి మహేందర్‌రెడ్డి పీహెచ్‌సీ వైద్యురాలు సాయి సౌమ్యకు సమ్మె నోటీసు అందజేశారు. గతంలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రం హరిస్తోందని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తోపాటు ఇతర సమస్యలు సాధించుకునేందుకు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

కౌడిపల్లి సీహెచ్‌సీలో డాక్టర్స్‌డే


డాక్టర్లకు సన్మానం చేసిన సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని సీహెచ్‌సీ(పీహెచ్‌సీ) డాక్టర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఫెర్హాజీలను వైద్యసిబ్బంది ఘనంగా సన్మానించి కేక్ కట్‌చేసి డాక్టర్స్‌డేను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధం చేయాలి


మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): వనమహోత్సవానికి అన్ని గ్రామాల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివాయిపల్లిలో నర్సరీని పరిశీలించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను నాటాలని గ్రామ కార్యదర్శి సవితకు సూచించారు. నూతన నర్సరీకి సంబంధించి బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లేశం తదితరులున్నారు.

ఎల్లమ్మ ఆలయం పూజలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ఉదయం అభిషేకం, అలంకరణ పూజా కార్యక్రమాలతో పాటు మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ సన్నిధిలో అన్న ప్రసాదం నిర్వహించారు.

ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఈఏపీసెట్ కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొదటి రోజు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విద్యార్థులకు ఐడీ, పాస్‌వర్డ్ అందజేశామని, ఐడీ పొందిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అభినవ్ పాల్గొన్నారు.

అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): అంతర పంటలతో మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలంటే కంది సాగుపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ సూచించారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పప్పు దినుసులు 2025 పథకంలో భాగంగా రైతు వేదికలో రైతులకు కంది విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో కాలేజీకి రోడ్డు

హుస్నాబాద్‌రూరల్: పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డును రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.'కాలేజీకి రోడ్డు నిర్మించరూ..?' అనే శీర్షికన సోమవారం సాక్షిలో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను పనుల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో డీఈ మహేశ్ మంగళవారం పనులు ప్రారంభించారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖనం పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ప్రసన్నకుమారి ప్రథమ బహుమతి, పదవ తరగతి విద్యార్థిని అక్షయ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేశం, శశి, శేఖర్ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహ బంధు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్‌రావు తెలిపారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని వైద్యులకు సన్మానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, జోన్ చైర్మన్ బుచ్చేష్, అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచారి


మాట్లాడుతున్న రవిచారి

మెదక్‌జోన్: రోజురోజుకు ఆర్థికంగా చితికిపోతున్న స్వర్ణకారులను ఆదుకునేందుకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు పూనా రవిచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వర్ణకారులు వృత్తిపై ఆధారపడి ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దౌర్భాగ్య దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మెదక్‌లో మీడియాతో మాట్లాడారు. స్వర్ణకారుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్లిప్త ధోరణితో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి స్వర్ణకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఏలేశ్వర బ్రహ్మాచారి, కార్యదర్శి ఇటిక్యాల వేణు, కోశాధికారి ఎస్. కాశీనాథం, నాయకులు బ్రహ్మం,డి. మహేష్, సి.హెచ్.నరేష్, ఎం. నవీన్, రాజు తదితరులున్నారు.

ఈపాస్‌తో ఎరువులు విక్రయించాలి

జిల్లా వ్యవసాయాధికారి వినయ్

కొల్చారం(నర్సాపూర్): ఎరువుల దుకాణాలకు ఈ పాస్ మిషన్ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులకు ఈపాస్ మిషన్లను అందజేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు, మందులను ఈ– పాస్ మిషన్ ద్వారానే కొనుగోలు చేయాలని సూచించారు. దుకాణాల యజమానులు రైతులకు కొనుగోలు సమయంలో రసీదు ఇవ్వాలని, ఎరువుల నిల్వలను ఈపాస్ మిషన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఏఓ శ్వేత, తదితరులు పాల్గొన్నారు.


డీలర్లకు ఈ పాస్ మిషన్లను అందజేస్తున్న దృశ్యం

జిల్లాలో 30,30(ఎ) యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


భరోసా సిబ్బందిని అభినందిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని (జులై 1న నుంచి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన లు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. అలాగే ప్రజాధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

భరోసా సిబ్బంది కృషి అభినందనీయం

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసులు నిందితుడికి శిక్షపడేలా విశేష కృషి చేసిన భరోసా సిబ్బందిని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు. ఆరేళ్ల బాలికపై జరిగిన లైంగికదాడి కేసులో శిక్షపడేలా కృషి చేసిన భరోసా సిబ్బందికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా భద్రత విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా ప్రశంసా పత్రం అందజేశారు. ఈ తీర్పు భరోసా కేంద్రం యొక్క న్యాయ, మానసిక, సాంకేతిక సేవలపై అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. భవిష్యత్తులోనూ బాధితులకు న్యాయం, మానసిక బలాన్ని అందించేందుకు భరోసా కేంద్రం కృషి చేస్తూనే ఉంటుందన్నారు.

విద్యుత్‌శాఖలో అక్రమ బదిలీలు

- నిబంధనలకు విరుద్ధంగా జారీ
- రద్దు చేయాలని ఫిర్యాదు

మెదక్ కలెక్టరేట్: విద్యుత్‌శాఖ ఎస్‌ఈ నిబంధనలకు విరుద్ధంగా జారీచేసిన బదిలీ ఆర్డర్లను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మెదక్ విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శంకర్ 30న తన రిటైర్మెంట్ రోజు రాత్రి 9 గంటలకు బదిలీల ఆదేశాలు ఇచ్చారన్నారు. ఉన్నతాధికారులు ఈ అక్రమ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే సీఎండీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, అశోక్, శేఖర్, కిరణ్, నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


బదిలీ ఆర్డర్లను చూపుతున్న కార్మిక సంఘం నాయకులు

ట్రేడ్ లైసెన్సుల ప్రక్రియ వేగవంతం

సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ రుషికేష్ శ్రీవాత్సవ్

దుబ్బాక: మున్సిపాలిటీలో వాణిజ్య, వ్యాపార సముదాయాలకు జారీచేసే ట్రేడ్ లైసెన్స్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ రుషికేష్ వాత్సవ్ ఆదేశించారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ, భువన్ యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించే వివరాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను కమిషనర్ రమేశ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్సుల దరఖాస్తులపై అవగాహన కల్పించాలన్నారు. భువన్‌యాప్‌లో భవనాలు, వాణిజ్య, వ్యాపారాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, నర్సయ్య తదితరులు ఉన్నారు.


పరిశీలిస్తున్న రుషికేష్ శ్రీవాత్సవ్

ఎంబీసీ నిరుద్యోగులకు శిక్షణ

జిల్లా అధికారి నాగరాజమ్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎంబీసీ నిరుద్యోగులకు వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఉచితంగా నైపుణ్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నాగరాజమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని, ఆసక్తి కల్గిన వారు 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.